సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



కుష్టుపై సమరం

కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇంటింటి సర్వేతో వ్యాధి లక్షణాలున్నవారిని గుర్తించి ఉచితంగా మందులు అందిస్తోంది. 8లో



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు పెరిగాయి. రాత్రి స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

బాలకృష్ణపై చర్యలు తీసుకోండి

- రాజకీయ కార్యక్రమాల కోసం చిన్నారులను వేధించడం తగదు
- పోలీసులకు వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఫిర్యాదు



హిందూపురం రూరల్ సీఐ వీరన్నకు ఫిర్యాదు చేస్తున్న న్యాయవాదులు

హిందూపురం: టీడీపీ కార్యక్రమంలో చిన్నారులను భాగస్వాములను చేయడంతో పాటు గంటల తరబడి వారిని ఎండలో నిల్చోబెట్టిన హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హిందూపురం లీగల్ సెల్ సభ్యులు కృష్ణమూర్తి, నవీన్‌కుమార్, వేణుగోపాల్ శుక్రవారం హిందూపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం బాలకృష్ణ తన పర్యటనలో భాగంగా హిందూపురం, చిలమత్తూరు ప్రాంతాల్లో చిన్నారులను పార్టీ కార్యక్రమాలకు ఉపయోగించుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రజా ప్రతినిధిగా చట్టాలను గౌరవించి పాటించాల్సిన బాలకృష్ణ...బాలల హక్కులను ఉల్లంఘించారన్నారు. దీనిపై కేసు నమోదు చేయాలని లీగల్ సెల్ సభ్యులు హిందూపురం రూరల్ సీఐ వీరన్నను కోరారు. ఈ మేరకు ఫిర్యాదు అందజేశారు.

పాఠశాల యాజమాన్యానికి నోటీసులిస్తాం


చిలమత్తూరు: హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు స్వాగతం పలికేందుకు చిన్నారులను పంపిన ప్రైవేటు స్కూల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేస్తున్నట్లు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. బాలల హక్కులను కాలరాసి వారిని బాధపెట్టిన ఎమ్మెల్యే బాలకృష్ణ చట్ట ప్రకారం శిక్షార్హులన్నారు. ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం ఏ రాజకీయ పార్టీ కూడా ఎన్నికల ప్రచారానికి చిన్నారులను వాడుకోకూడదన్నారు. అలాగే చిన్నారులకు రాజకీయ పార్టీల కండువాలు వేయడం మంచి పరిణామం కాదన్నారు.

నేడు యువ న్యాయవాదుల సదస్సు



అనంతపురం: జేఎన్‌టీయూ ఆడిటోరియంలో శనివారం యువ న్యాయవాదుల సదస్సు నిర్వహిస్తున్నట్లు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ ఎ.రామిరెడ్డి తెలిపారు. సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ ఆశానుద్దీన్ అమానుల్లా ముఖ్య అతిథిగా, సుప్రీం కోర్టు జడ్జీలు జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి విశిష్ట అతిథులుగా హాజరవుతారన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా, హైకోర్టు జడ్జీలు జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, జస్టిస్ కె.మన్మథరావు, జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ బి.శ్యామసుందర్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ చైర్మన్ ఎస్.ప్రభాకరన్, ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ అపూర్వ కుమార్ శర్మ, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, వైస్ చైర్మన్ రామ జోగేశ్వర రావు, అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.విశ్వనాథరెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతున్నారన్నారు.

ఎంటెక్ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో జనవరిలో జరిగిన ఎంటెక్ మూడో సెమిస్టర్ (ఆర్–21) మూడో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ శుక్రవారం విడుదల చేశారు. పరీక్షలు ముగిసిన 9 రోజుల్లోనే ఎంటెక్ ఫలితాల విడుదలకు కృషి చేసిన డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి.విష్ణువర్ధన్‌ను ప్రశంసించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణ కాంతి, పాలక మండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ జి.మమత, అజిత, డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ కేఎఫ్ భారతి తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో వందేళ్ల అభివృద్ధి!

'అభివృద్ధి కళ్లముందు కనిపించాలి.. సంక్షేమం అర్హుల లోగిళ్లలోకే వెళ్లాలి' ఇదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మిన సిద్ధాంతం. అధికారం చేపట్టిన నాటి నుంచీ అంతే బాధ్యతగా పనిచేశారు. దేశానికే పట్టుగొమ్మలైన పల్లెలకు ప్రాణం పోశారు. విద్య, వైద్యం, మౌలిక వసతులతో ప్రగతికి చిరునామాగా మార్చారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలతో ముంగిళ్లలోకే సేవలు తీసుకువచ్చారు. పల్లెను సంతోషాల లోగిలిగా మార్చారు. అలాంటి వేలాది పల్లెల్లో పుట్టపర్తి మండలం జగరాజుపల్లి పంచాయతీ ఒకటి.

- మారిన జగరాజుపల్లి రూపురేఖలు
- మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట
- సంక్షేమ పథకాలతో లబ్ధిదారులకు చేయూత
- అభివృద్ధి కార్యక్రమాలతో అంతటా ఆనందోత్సాహాలు



జగరాజుపల్లి జగనన్న కాలనీలో నిర్మించుకున్న ఇళ్లు



ఆధునిక హంగులతో నిర్మించిన జగరాజుపల్లి సచివాలయం

పుట్టపర్తి అర్బన్: జగరాజుపల్లి పంచాయతీ..పుట్టపర్తికి 16 కి.మీ దూరంలో ఉంటుంది. ధర్మవరం –గోరంట్ల ప్రధాన రహదారికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గతంలో ఈ పేరు చెబితే 'పల్లె కన్నీరు పెడుతోందో' అంటూ గోరటి వెంకన్న రాసిన పాట గుర్తొచ్చేది. మోకాళ్లలోతు గుంతలు పడిన మట్టిరోడ్డు..తాగేందుకు నీరుండదు. కనీస సౌకర్యాలు కరువు. నిత్యం గ్రామస్తుల ధర్నాలు, బైఠాయింపులే. కానీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక జగరాజుపల్లి పంచాయతీ ప్రగతివైపు పయనించింది. ప్రస్తుత ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఈ గ్రామ పరిస్థితిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన చాలా సానుకూలంగా స్పందించారు. నిధుల వరద పారించారు. ఫలితంగా రూ.3.5 కోట్లతో లింకు రోడ్డు రూపుదిద్దుకుంది. అప్పటి నుంచి అభివృద్ధిలో జగరాజుపల్లి దూసుపోతోంది. వందేళ్లలో జరగని అభివృద్ధి ఆ ఐదేళ్లలోనే జరిగిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో అభివృద్ధి ఇలా...

జగరాజుపల్లిలో 547 కుటుంబాలు ఉన్నాయి. 1,472 మంది జనాభా ఉన్నారు. తొలి విడతలోనే సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించిన జగన్ సర్కార్ సకల సౌకర్యాలు కల్పించింది. గ్రామంలో 27 మంది నిరుపేదలకు ప్రధాన రోడ్డు పక్కనే స్థలాలు పంపిణీ చేయడంతో పాటు ఇళ్లను కూడా నిర్మించారు. సొంత స్థలం ఉన్న వారికి 56 ఇళ్లు మంజూరు చేశారు. ఆ నిర్మాణాలు కూడా పూర్తవుతున్నాయి. ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల కోసం రూ.1.5 కోట్లు వెచ్చించారు. తరగతి గదుల్లో బెంచీలు, రంగులు వేయించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. మోడల్ స్కూల్ ప్రహరీతో పాటు కేజీబీవీలో నూతనంగా 8 గదులతో అధునాతన భవనం నిర్మిస్తున్నారు. అలాగే సుమారు రూ.32.5 లక్షలతో కాలనీల్లో సిమెంటు రోడ్లు వేశారు.

జగరాజుపల్లి జనాభా	1,472
కుటుంబాల సంఖ్య	547
తారురోడ్డు (5 కి.మీ) కోసం నిధులు	రూ.3.5 కోట్లు
వివిధ పథకాల కింద కలిగిన లబ్ధి	రూ.12 కోట్లు
సబ్‌స్టేషన్ నిర్మాణానికి చేసిన ఖర్చు	రూ.2 కోట్లు
'నాడు-నేడు' కింద కేటాయింపు	రూ.1.5 కోట్లు
సిమెంటు రోడ్ల కోసం వెచ్చించిన నిధులు	రూ. 32.5 లక్షలు
83 ఇళ్ల నిర్మాణాలకు (సుమారు)	రూ. 2 కోట్లు
'జల్ జీవన్' ద్వారా తాగునీటి కోసం	రూ. 4.5 లక్షలు





వందేళ్ల తర్వాత వేసిన తారు రోడ్డు



'నాడు-నేడు' నిధులతో కేజీబీవీ కోసం నిర్మిస్తున్న భవనం



రూ.2 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్

చుట్టుపక్కల గ్రామాలకు లోఓల్టేజీ సమస్య లేకుండా పక్కనున్న సబ్ స్టేషన్లపై భారం లేకుండా గ్రామంలో సుమారు రూ. 2 కోట్లతో 5 ఎంవీఏ కెపాసిటీతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఇది పూర్తయితే సుమారు 15 గ్రామాలకు విద్యుత్ సరఫరా మెరుగవుతుంది. దీంతో పాటు జల్ జీవన్ మిషన్ కింద తాగునీటి పైప్‌లైను, ఇంటింటికీ కొళాయి సౌకర్యాన్ని రూ.4.5 లక్షలతో పూర్తి చేస్తున్నారు. గ్రామ సమీపంలోనే నేషనల్ హైవే 342 వెళ్తుండటంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి.

అద్దె ఇంటి బాధలు తప్పాయి



నేను, మా ఆయన కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. మాకు పెళ్లయినప్పటి నుంచి ఓ చిన్న ఇంట్లో అద్దెకు ఉండే వాళ్లం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాకు ప్రధాన రహదారిలో 1.5 సెంట్ల స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు కూడా మంజూరు చేసింది. దీంతో మా కలల గూడు కట్టుకున్నాం. ఇప్పుడు సొంతింట్లో సంతోషంగా ఉంటున్నాం. అలాగే వివిధ సంక్షేమ పథకాల కింద మాకు లబ్ధి చేకూరుతోంది. ఏమిచ్చినా జగనన్న రుణం తీర్చుకోలేం. **– గంగరత్న, సుబ్బరాయుడు దంపతులు, జగరాజుపల్లి**

ఎన్నడూ ఇంత అభివృద్ధి ఎరుగం



మా గ్రామంలో ఇంత అభివృద్ధి చూడలేదు. రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపారు. 20 ఏళ్లలో ఎన్నడూ నీళ్లు కనిపించని చెరువు.. రెండుసార్లు మరువపారింది. దీంతో రైతులంతా సంతోషంగా ఉన్నారు. ఇక ఇళ్లు, రోడ్లు, భవనాలు, తాగునీరు, పింఛన్లు ఇలా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో మా ఊరే మారిపోయింది.

– రమణారెడ్డి, గ్రామస్తుడు, జగరాజుపల్లి

గ్లాసు గల్లంతు!

సార్వత్రిక ఎన్నికల వేళ అన్ని రాజకీయ పార్టీలు అస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. నాయకులు, కార్యకర్తలు ఊరూవాడా తిరుగుతూ జనంతో మమేకం అవుతుండగా.. ఒక్క పార్టీ మాత్రం ఉలుకూ పలుకూ లేకుండా ఉంది. ప్రశ్నిస్తామంటూ పుట్టుకొచ్చిన ఆ పార్టీ... ఎన్నికల్లో పోటీ చేస్తారా...? అంటే సమాధానం చెప్పలేక సతమతమవుతోంది.

- జనసేన ప్రభావం జిల్లాలో నామమాత్రమే
- పార్లమెంటు పరిధిలో ఒక్క సీటూ కష్టమే
- ధర్మవరం, పుట్టపర్తిపై జనసేన ఆశలు ఆవిరి
- పవన్ కల్యాణ్ తీరుపై కార్యకర్తల మండిపాటు
- మళ్లీ టీడీపీ జెండా మోయాల్సిందేనా.. అంటూ ఆవేదన



సాక్షి, పుట్టపర్తి

జిల్లాలో గ్లాసు గుర్తు పార్టీ జనసేన ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఆ పార్టీ నాయకులు సామాజిక మాధ్యమాల్లో హడావుడి చేస్తున్నా...క్షేత్ర స్థాయిలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. జిల్లాలో రెండు స్థానాలు తమకు ఇవ్వాలని జనసేన కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. అయితే అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయాలతో ఆ పార్టీ హిందూపురం పార్లమెంటు పరిధిలో ఒక్క చోటైనా పోటీ చేస్తుందా.. అన్నది సందేహంగా మారింది. మరోవైపు జిల్లాలో జనసేనకు ఒక్క సీటు కూడా ఉండదని టీడీపీ కార్యకర్తలు బహిరంగ ప్రచారం చేస్తున్నారు. పైగా చంద్రబాబుతో పవన్‌కల్యాణ్ కూడా డీల్ కుదుర్చుకున్నారని చెబుతున్నారు. దీంతో అధిష్టానం నుంచి ఎలాంటి సానుకూల స్పందన లేకపోవడంతో జనసేన కార్యకర్తలు నైరాశ్యంలో పడ్డారు. గతంలో మాదిరిగా మళ్లీ టీడీపీ జెండా మోయాల్సిందేనా అని మదనపడుతున్నారు. జనసేన అధినేతకు చెప్పలేక.. టీడీపీ వెంట నడవలేక.. కొందరు పార్టీ వీడే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

జనసేనకు 'సున్న'మే..

ఈ ఎన్నికల్లో జిల్లాలో కనీసం రెండు సీట్లు డిమాండ్ చేయాలని జనసేన నాయకులు అనుకున్నారు. ధర్మవరం, పుట్టపర్తి లేదా కదిరి సీటు జనసేనకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అయితే ఆయా నియోజకవర్గాల్లో జనసేనకు టికెట్ ఇచ్చేందుకు టీడీపీ అధిష్టానం మొగ్గు చూపడం లేదని తెలుస్తోంది. దీంతో జిల్లాలో జనసేన పోటీ ఉండదని తేలిపోయింది. అక్కడక్కడా జనసేన పేరుతో తిరిగే కార్యకర్తలు.. టీడీపీ జెండా మోయాల్సిన పరిస్థితి నెలకొంది.

అధినేతపై మండిపాటు..

టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పినట్లు పవన్ కళ్యాణ్ ఆడుతున్నారు. కనీసం కార్యకర్తల బాధలను పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని చాలామంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పుట్టపర్తిలోని ఓ జనసేన కార్యకర్తతో మాట్లాడగా.. 'గట్టిగా ప్రయత్నిస్తే 65 సీట్లలో పోటీ చేసే వాళ్లం. కానీ మా పవనన్న పట్టించుకోకపోవడంతో ఆ సంఖ్య 20 లోపే ఉంటుందేమో. ఏమీ చేయలేం' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. 'పవన్ కల్యాణ్ సైకిల్ దిగితేనే మేం పోటీలో ఉండేది' అని మరో కార్యకర్త తన మనసులో మాట తెలియజేశారు.

ఎన్నాళ్లిలా? ..

ప్రతి ఎన్నికల వేళ జనసేన నేతలు ఏదో ఒక పార్టీ జెండా మోయకతప్పని పరిస్థితి. 2014లో పోటీ చేయకుండా.. టీడీపీకి మద్దతు తెలిపిన జనసేన... 2019 ఎన్నికల్లో హడావుడి చేసింది. అయితే జిల్లాలో ఒక్క చోట కూడా డిపాజిట్ రాలేదు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ జనసేన పోటీ చేసిందో? లేదో? కూడా ఆ పార్టీ వాళ్లకే తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఈసారి జనసేనకు సీట్లు ఇచ్చేందుకు టీడీపీ అధిష్టానం వెనుకడుగు వేస్తున్నట్లు తెలిసింది. దీంతో ఈ సారి కూడా టీడీపీ జెండా మోయాల్సిందేనా అని కార్యకర్తలు బాధపడుతున్నారు.

నాయకుల పేర్లు కూడా తెలియదే!

జిల్లాలో జనసేన నాయకులు ఎవరని సామాన్యులను ప్రశ్నిస్తే... కనీసం రెండు పేర్లు కూడా చెప్పలేని పరిస్థితి. కార్యకర్తలే లేకపోవడంతో గ్రామ స్థాయి నాయకులే నియోజకవర్గ నాయకులుగా చలామణి అవుతున్నారు. ఉన్న ఒకరిద్దరు కూడా పబ్లిసిటీ పిచ్చితో జనసేనలో తిరుగుతున్నట్లు చెబుతున్నారు.

ఈసీ నిబంధనలు పక్కాగా పాటించాలి

- ఆర్ఓ, ఏఆర్ఓలకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అధికారులంతా ఎన్నికల కమిషన్ నిబంధనలన్నీ తూచా తప్పక పాటించాలని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ, రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉంటుందన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పోలింగ్ విధులకు సిద్ధం కావాలన్నారు. ఈవీఎంల సీలింగ్ నుంచి మాక్ పోలింగ్ వరకూ గత ఎన్నికల కంటే ఇప్పుడు చాలా మార్పులు వచ్చాయన్నారు. ఎన్నికల సంఘం సూచించిన విధి విధానాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలన్నారు. ఆర్ఓ, ఏఆర్ఓలకు ఎన్నికల విధులపై సరైన అవగాహన ఉంటే ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు ఏదైనా సందేహం తలెత్తినా వెంటనే నివృత్తి చేసే అవకాశం ఉంటుందన్నారు. అందుకోసమే శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఆర్ఓలంతా తప్పనిసరిగా హ్యాండ్ బుక్ పూర్తిగా చదవాలన్నారు. రాజకీయ నాయకులు చేసే ఫిర్యాదులను ఎన్నికల విభాగం డీటీ తీసుకొని పరిశీలించాలన్నారు. ఆర్ఓలు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని, సౌకర్యాలను పరిశీలించి నివేదికలు అందజేయాలన్నారు. జిల్లాలోని ఎంఈఓలతో సమావేశం ఏర్పాటు చేసి కేంద్రాల్లో ఏవైనా పనులు ఇంకా పెండింగ్‌లో ఉంటే వాటిని ఫిబ్రవరి 21వ తేదీ నాటికి పూర్తి చేయించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే అయా పోలింగ్ కేంద్రాల వద్ద పనిచేసే నెట్‌వర్క్, స్ట్రాంగ్ రూముల వివరాలను తెలియజేయాలన్నారు. అనంతరం పోలింగ్ విధులు, ఈవీఎంల పనితీరు, వినియోగం, వీవీప్యాట్లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు పరిశీలన, ఓటరు నొక్కే బ్లూ బటన్ పరిశీలన గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన ద్వారా వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్ఓ కొండయ్య, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, కదిరి, పుట్టపర్తి, ధర్మవరం ఆర్డీఓలు వంశీకృష్ణ, భాగ్యరేఖ, వెంకట శివరామిరెడ్డి, మడకశిర ప్రత్యేకాధికారి గౌరీ శంకరరావు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, డీటీలు పాల్గొన్నారు.

బీకే పార్థసారథి మహిళా ద్వేషి



రొద్దంలో సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

- 30 ఏళ్లుగా నియోజకవర్గానికి బీకే చేసిందేమీలేదు
- కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటా
- మంత్రి ఉషశ్రీ చరణ్

రొద్దం: టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి మహిళా ద్వేషి అని, ఇటీవల ఆయన తన ప్రసంగాల్లో మహిళా ప్రజాప్రతినిధులపై చేసిన అనుచిత వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ అన్నారు. శుక్రవారం ఆమె రొద్దంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళలు రాజకీయంగా ఎదగకూడదన్నదే బీకే పార్థసారథి అభిమతమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ తనకు టికెట్ ఇస్తుందో లేదో తెలియక ఆ బాధలో అతను మాట్లాడుతున్నట్లు తెలుస్తోందన్నారు. 'జయహో బీసీ' అంటూ బీసీలను గురించి మాట్లాడుతున్న బీకే పార్థసారథి...మండలంలో కనీసం ఒక కనకదాసు విగ్రహం కూడా పెట్టలేకపోయారన్నారు. అలాగే 30 ఏళ్లుగా నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిందేమీ లేదన్నారు. ప్రజలు ఆయన్ను తిరస్కరిస్తున్నారని, అందువల్లే బీకే పార్థసారథి తన సొంత పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థిని, వార్డులో వార్డు మెంబర్‌ను గెలిపించుకోలేకపోయారన్నారు. అలాంటి వ్యక్తి ఎమ్మెల్యేగా పోటీ పడతానని ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. కానీ జనరంజక పాలనతో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు చేసిన పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. అలాగే బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేసిన ఏకైక నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. అనంతరం ఆమె మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్లతో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమీక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ, ఎంపీపీ చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ రూప, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావతి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, పార్టీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతిరెడ్డి, మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, రొద్దం, కలిపి సింగిల్ విండో చైర్మన్లు లక్ష్మీనారాయణరెడ్డి, కేపీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

27న డాక్ అదాలత్

అనంతపురం సిటీ: కర్నూలు రీజియన్ పరిధిలో తపాలా శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న డాక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ అనంతపురం డివిజన్ పీఆర్ఓ పాటిల్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కర్నూలు రీజియన్ పరిధిలో తపాలా శాఖ పరంగా ఎలాంటి సమస్యలున్నా రాతపూర్వకంగా 'అసిస్టెంట్ డైరెక్టర్, పోస్ట్‌మాస్టర్ జనరల్ వారి కార్యాలయం, కర్నూలు–518002 చిరునామాకు చేరేలా ఫిర్యాదు పంపాలి. కవర్‌పై డాక్ అదాలత్ అని స్పష్టంగా రాయాలి.

మహిళపై టీడీపీ నేత దాడి


పరిటాల శ్రీరామ్‌తో టీడీపీ నేత హరికృష్ణ (ఫైల్)

కనగానపల్లి: మండలంలోని తూంచర్లలో ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత హరిక్రిష్ణ దాడి చేశాడు. బాధితురాలు వరలక్ష్మి కనగానపల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... గురువారం సాయంత్రం పొలం వద్ద ఉన్న పశువుల పాక వద్ద ఆమె పనిచేసుకుంటుండగా హరికృష్ణ వెళ్లాడు. ఆమె భర్త హనుమంతరెడ్డి ఎక్కడికి వెళ్లాడంటూ గద్దిస్తూ తనకు స్ప్రింక్లర్ పైపులు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. దీంతో తన భర్త వచ్చిన తర్వాత మాట్లాడి తీసుకెళ్లాలని ఆమె తెలిపింది. ఆ సమయంలో ఆగ్రహానికి లోనైన హరికృష్ణ ఆమెపై దాడి చేశాడు. సమీప పొలాల్లో పనిచేసుకుంటున్న వారు అక్కడకు చేరుకుని సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా వినకుండా విచక్షణారహితంగా దాడి చేయడంతో వరలక్ష్మి తీవ్రంగా గాయపడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి శుక్రవారం హరికృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

407 బోల్తా - డ్రైవర్ మృతి


నరసింహులు (ఫైల్)

ముదిగుబ్బ(ధర్మవరం రూరల్): రోడ్డు ప్రమాదంలో ఓ 407 వాహన డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... నంబూలపూలకుంటకు చెందిన ఏలేటి నరసింహులు (23) ధర్మవరం పట్టణానికి చెందిన రంగనాయకులు వద్ద 407 వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం కదిరిలో ఆర్‌టీఓ కార్యాలయానికి వెళ్లి వాహనం ఫిట్‌నెస్ చెక్ చేయించుకుని ధర్మవరానికి తిరుగు ప్రయాణమయ్యాడు. ముదిగుబ్బ మండలం రాళ్లఅనంతపురం వద్దకు చేరుకోగానే నియంత్రణ కోల్పోయి డివైడర్‌ను ఢీకొనడంతో వాహనం బోల్తా పడింది. ఘటనలో నరసింహులు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కుష్టుపై సమరం

- వ్యాధి విస్తరించకుండా ఎక్కడికక్కడ కట్టడికి చర్యలు
- ఆర్నెల్ల పాటు వైద్యుల పర్యవేక్షణలో రోగులు
- ఫ్యామిలీ డాక్టర్ విధానంతో మెరుగైన చికిత్సలు
- ఉచితంగా మందుల పంపిణీ


శరీరంపై మచ్చలను గుర్తిస్తున్న ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు (ఫైల్)

సాక్షి, పుట్టపర్తి: కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమరం చేస్తోంది. వ్యాధి పేరు వినగానే భయపడే రోజులు పోయాయి. గతంతో పోల్చుకుంటే వ్యాధి తీవ్రతతోపాటు బాధితులూ తగ్గిపోయారు. మిగిలిన శాతాన్ని కూడా అరికట్టడానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రత్యేక సర్వేకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఇంటింటా కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ప్రత్యేక సర్వే చేపట్టింది. వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించడం. వారికి మందులు పంపిణీ చేయడం, వ్యాధి తగ్గే వరకూ పర్యవేక్షించడం వంటివి లక్ష్యంగా కార్యాచరణ రూపొందించి పటిష్టంగా అమలు చేస్తోంది.

జిల్లా వ్యాప్తంగా 99 కేసులు..

కుష్టు వ్యాధి ప్రాణాంతకం కాకపోయినా అంగవైకల్యానికి దారి తీస్తుంది. ముందుగానే గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా అరికట్టేందుకు వీలవుతుంది. ఆధునిక వైద్య శాస్త్రం విశేషమైన ఫలితాలు సాధిస్తున్న ప్రస్తుత రోజుల్లోనూ కుష్టు వ్యాధిపై అపోహలు వీడడం లేదు. దీంతో కుష్టు బారిన పడిన వారి పట్ల కుటుంబ సభ్యులతో పాటు ప్రజల్లోనూ చిన్నచూపు ఉంటోంది. ఈ క్రమంలో కుష్టు వ్యాధిపై ఓ వైపు ప్రజలను చైతన్య పరుస్తూనే మరో వైపు కట్టడికి జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా అధికారులు చేపట్టిన సర్వేలో 99 మంది కుష్టు వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు తేలింది.

ముమ్మరంగా అవగాహన..

జగన్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఇప్పటికే ఇంటి వద్దనే మెరుగైన వైద్యసేవలను వైద్యాధికారులు అందజేస్తున్నారు. ఈ క్రమంలో మరు అడుగు ముందుకేసి కుష్టు వ్యాధిపై అపోహలను దూరం చేసేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. శరీరంపై కుష్టు లక్షణాలతో కూడిన మచ్చలు కనిపించిన వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించుకుంటున్నారు. వ్యాధిగ్రస్తులకు ఆర్నెళ్ల పాటు క్రమం తప్పకుండా ప్రతి నెలా ఆశ కార్యకర్తల ద్వారా ఉచితంగా మందులు అందజేస్తున్నారు.ముందుగా వ్యాధిని పసిగడితే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో కుష్టు నియంత్రణ చర్యలు ముమ్మరం చేసి ప్రతి పల్లెలోనూ విస్తృత చైతన్య కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొంటున్నారు.

వ్యాధి కట్టడికి చర్యలు..

జిల్లాలో కుష్టు నియంత్రణకు ప్రతి నెలా ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తోంది. ఒక్కో రోగికి ఆర్నెళ్లు, ఏడాది చొప్పున రూ.8 వేలు విలువ చేసే కోర్సుకు సరిపడా మందులు ఉచితంగా ఆయా గ్రామాల ఆశ కార్యకర్తల ద్వారా చేరవేస్తోంది. శరీరంపై ఐదు మచ్చల లోపు ఉంటే ఆర్నెళ్ల చికిత్స కోర్సు, ఐదు కంటే ఎక్కువ మచ్చలు ఉంటే ఏడాది పాటు మందులు వాడాల్సిన అవసరం ఉంటుంది.

కుష్టుకు కారణాలు..

మైక్రో బాక్టీరియం లేప్రే అనే బాక్టీరియా ద్వారా కుష్టు వ్యాధి వస్తుంది. వ్యాధికారక క్రిములు శరీరంలోకి ప్రవేశించిన తర్వాత రెండు నుంచి ఏడు రోజుల్లో లక్షణాలు బయటపడుతాయి. తొలుత చర్మం, మ్యూకస్ మెంబ్రేన్‌నరాలు రోగానికి గురవుతాయి. రోగి సరైన జాగ్రత్తలు తీసుకోకుండా ఉంటే దుమ్ము ధూళి, ఊపిరి ద్వారా లోపలికి చేరుకొని రోగ నిరోధకశక్తి తగ్గుతుంది. తెల్లమచ్చలు ఉన్నచోట స్కిన్ క్లిప్ పరీక్ష చేసి క్రిములను గుర్తించి వైద్యాన్ని అందిస్తారు.

జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులు	99 మంది
పీబీ కేసులు (ఐదు మచ్చల లోపు)	15
ఎంబీ కేసులు (ఐదు మచ్చల పైబడి)	84
పీబీ కేసుల చికిత్స కాలం	ఆర్నెళ్లు
ఎంబీ కేసుల చికిత్స కాలం	12 నెలలు
కోర్సు పూర్తి చేసే లోపు అందజేసే మందుల విలువ	రూ.8 వేలు

లక్షణాలు ఇవే..

శరీరంపై చుట్టూ ఉన్న చర్మంతో పోలిస్తే మచ్చలు పాలిపోయినట్లు ఉంటాయి. మచ్చలు గుండ్రటి ఆకారంలో ఉంటాయి. మచ్చలపై వేడి, నొప్పి, స్పర్శ తెలియవు.

చర్మం మీద మచ్చలున్న ప్రాంతానికి వచ్చే నాడులు వాపు తేలుతాయి. మోకాలి వెలుపల పక్కన, మోచేయి లోతట్టున, మెడలోనూ నాడులు లావెక్కి కనిపిస్తాయి. నొప్పి, దురద, పుండ్లు వచ్చి మానక పోవడం, ముఖం మీద చర్మం మందంగా తేలి ఉండడం, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోవడం, పాదాలు, చేతులు శక్తి హీనమై వంకరలు పోవడం జరుగుతాయి.

పూర్తిగా నయం చేయవచ్చు



కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. ఆధునిక చికిత్స విధానం అందుబాటులో ఉంది. ఇప్పటికే జిల్లాలో గుర్తించిన 99 మందికి ప్రతి నెలా క్రమం తప్పకుండా మందులు పంపిణీ చేస్తున్నాం. కుష్టు వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. శరీరంపై స్పర్శ లేని మచ్చలు కనిపించిన వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి పరీక్ష చేయించుకుంటే మంచిది. నిర్ధారణ అయితేనే చికిత్స మొదలుపెడతారు.

– డాక్టర్ తిప్పయ్య, క్షయ, కుష్టు వ్యాధుల నియంత్రణ పీఓ

జనవాక్కు

ఎంతో రుణపడ్డాం



చంద్రబాబు హయాంలో సంక్షేమ పథకాలు అందక ఆర్థికంగా చాలా ఇబ్బంది పడ్డాం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుద్యోగిగా ఉన్న నాకు వలంటీర్ పోస్టు దక్కింది. నా కుమార్తె చదువులకు ఢోకా లేకుండా అమ్మ ఒడి పథకం వర్తించింది. చేయూత పథకం కింద మా అత్తకు ఏటా రూ.18,750 అందుతోంది. మా అవ్వకు పింఛన్ వస్తోంది. ఇంతలా ఆదుకున్న జగనన్నకు మేమెంతో రుణపడ్డాం. జగనన్నను మరోసారి సీఎంగా చేయడానికి నేను సిద్ధం.

– అనితమ్మ, ఫళారం, గుడిబండ మండలం

అన్ని విధాలుగా ఆదుకున్నారు



రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వివిధ సంక్షేమ పథకాలతో మా కుటుంబాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారు. అమ్మ ఒడి పథకంతో పిల్లలను చదివించుకోగలుగుతున్నాం. వైకల్యంతో బాధపడుతున్న మా నాన్నకు దివ్యాంగుల పింఛన్, మా అమ్మకు వృద్ధాప్య పింఛన్ అందుతోంది. అన్నింటి కంటే ముఖ్యంగా మా ఊళ్లోని పాఠశాల రూపురేఖలు సమూలంగా మార్చివేసి, పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన సీఎం వైఎస్ జగన్‌కు మేమెంతో రుణపడ్డాం. మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని కోరుకొంటున్నాం.

– తిరుపాల్‌నాయక్, శెట్టిపల్లి, పెనుకొండ మండలం

రైలు ఢీకొని దివ్యాంగుడి మృతి

కదిరి టౌన్: ప్రమాదవశాత్తు రైలు ఢీకొన్న ఘటనలో ఓ దివ్యాంగుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరి మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల గ్రామానికి చెందిన వెంకటేష్ (53)కు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. పుట్టుకతోనే చెవుడు, మూగ బాధపడుతున్న వెంకటేష్ వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పొలం పని ముగించుకుని ఇంటికి బయలుదేరిన ఆయన.. తిరుపతి నుంచి అకోలాకు వెళుతున్న రైలును గమనించకుండా పట్టాలు దాటే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో వేగంగా దూసుకొచ్చిన రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టాలు దాటుతున్న సమయంలో వెనుక కొద్ది దూరంలో వస్తున్న భార్య వెంకటేష్‌ను అప్రమత్తం చేసేందుకు కేకలు వేసింది. అయితే చెవుడు కారణంగా ఆయన వినిపించుకోలేదు. ఇంటి పెద్దను కోల్పోవడంతో కుటుంబసభ్యులు రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు జీఆర్పీ ఎస్ఐ రహీం తెలిపారు.

నేటి నుంచి చోళమాంబ పెద్ద జాతర

- 102 సంవత్సరాల తర్వాత ఉత్సవాల నిర్వహణ
- భారీగా ఏర్పాట్లు చేసిన గ్రామస్తులు


ఉత్సవాలకు ముస్తాబైన అమ్మవారి దేవాలయం

అమరాపురం: మండల కేంద్రంలోని కోట వీధిలో వెలసిన ఐదు గ్రామాల దేవత చోళమాంబదేవి ఉత్సవాలు శనివారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకూ అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఈ మేరకు ఆలయ కమిటీ అధ్యక్షుడు శివకుమార్‌గౌడ్, గౌంచికార్లు, గౌడలు, శానుబోగలు శుక్రవారం తెలిపారు. పాత ఆలయాన్ని భక్తుల నుంచి సేకరించిన విరాళాలతో ఇటీవల అత్యంత సుందరంగా పునః నిర్మించారు. దీంతో ఆలయ ప్రారంభోత్సవం, అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్టాపన తదితర కార్యక్రమాలను శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. అమరాపురం గ్రామంతో పాటు బంగారుపాళ్యం, వీరాపురం, పుల్లీకుంట, మద్దనకుంట గ్రామాల ప్రజల కొంగు బంగారంగా అమ్మవారి ఆలయం విరాజిల్లుతోంది. కోరిన కోరికలు తీర్చే అమ్మవారిగా ఖ్యాతి గాంచిన చోళమాంబను కులమతాలకు అతీతంగా అందరూ కొలుస్తుంటారు. 102 సంవత్సరాల తర్వాత ఉత్సవాన్ని నిర్వహిస్తుండడంతో గ్రామస్తులు భారీగా ఏర్పాట్లు చేశారు.

ఉత్సవాలు ఇలా...

- 10న వినాయక, అభయాంజనేయ స్వామి పూజలు, వెన్నతో అలంకరణ ఉంటాయి.
- 11న చోళమాంబదేవి ఆలయ గోపుర కలశ స్థాపన, అమ్మవారికి విశేష పూజలు, రాత్రి జలధి ఉత్సవం నిర్వహిస్తారు.
- 12న వేకువజామున జలధి ఉత్సవం నుంచి అమ్మవారి విగ్రహాన్ని వెలికి తీసి ప్రాణప్రతిష్ట చేస్తారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నారు.
- 13న అమ్మవారికి హారతి ఉత్సవం, 14న అమ్మవారి ఉత్సవ మూర్తి ఊరేగింపు, 15న వసంతోత్సవం ఉంటాయి.

రేషన్ బియ్యం పట్టివేత

- ఆటో సీజ్, వ్యక్తిపై కేసు నమోదు

కనగానపల్లి: మండలంలోని గుదివాండ్ల సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం తగరకుంట– ఎగువపల్లి మార్గంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఆత్మకూరుకు చెందిన నరసింహులు ఆటోలో 19 ప్యాకెట్ల రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. ఒక్కో ప్యాకెట్‌లో 50 కిలోల చొప్పున రేషన్ బియ్యం ఉన్నట్లుగా గుర్తించామన్నారు. దీంతో వాహనాన్ని సీజ్ చేసి, నరసింహులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

సినిమాలకే పరిమితమైన బాలయ్య

- జగనన్న ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- వైఎస్సార్‌సీపీ హిందూపురం సమన్వయకర్త దీపిక


గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న టీఎన్ దీపిక, వైఎస్సార్‌సీపీ నాయకులు

హిందూపురం: నాలుగు దశాబ్దాలుగా హిందూపురానికి ఎమ్మెల్యేలుగా టీడీపీకి చెందిన వారే ఉంటున్నా... ఈ ప్రాంత అభివృద్ధికి వారు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. కేవలం సినిమాలకే పరిమితమైన ఎమ్మెల్యే బాలకృష్ణ పట్టణాభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. ఏళ్ల తరబడిగా కుంటుపడిన అభివృద్ధిని ఈ నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. హిందూపురం 38వ వార్డు పాతూరులో కౌన్సిలర్ రాధమ్మ అధ్యక్షతన శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న దీపిక ప్రతి గడపనూ సందర్శించి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. రెండుసార్లు బాలకృష్ణను ఎమ్మెల్యేగా గెలిపిస్తే హిందూపురం ప్రజలకు ఆయన చేసిన మంచి ఏదీ లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ఆ పార్టీ కౌన్సిలర్లు ఉన్న వార్డుల్లో అవసరం లేకున్నా రోడ్డుపై రోడ్డు వేసి నిధులు అడ్డగోలుగా దోచేశారన్నారు. దీంతో ఏళ్ల తరబడి అభివృద్ధికి హిందూపురం నోచుకోలేక పోయిందన్నారు. సంక్షేమ పాలనకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రాధాన్యత క్రమంలో పలు వార్డుల్లో ఇప్పటికే రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సౌకర్యాలు కల్పించినట్లు గుర్తు చేశారు. త్వరలో మిగిలిన ప్రాంతాల్లోనూ మౌలిక సౌకర్యాలను కల్పించి అభివృద్ధి చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించి హిందూపురం సమగ్రాభివృద్ధికి సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రామచంద్ర, మహిళా నాయకురాలు నాగమణి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, మురళి, రాము, ప్రభాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, ముద్ర రంగప్ప, నాగిరెడ్డి, వంశీ, ముజసిర్, శివారెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జిల్లా సబ్ జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

ధర్మవరం: హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ కర్నూలు వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్టుకు క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ శుక్రవారం ముగిసింది. ధర్మవరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో చేపట్టిన ఈ ప్రక్రియను జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు, కార్యదర్శి సూర్యప్రకాష్ పర్యవేక్షించారు. ఎంపికైన వారిలో వంశీకృష్ణ (కెప్టెన్), మహేష్, అభిషేక్, ఫజులుద్దీన్, శబరీష్‌గౌడ్, శివప్రసాద్, వెంకట్ అభిషిక్త్, రితీష్, రవితేజ, గణేష్, సంతోష్, అఖిల్‌కుమార్‌రెడ్డి, సాదిక్‌వలి, సంతోష్‌కుమార్‌రెడ్డి, సాత్విక్, అభిరామ్, ఆదికేశవ, రాంచరణ్ ఉన్నారు. అలాగే జట్టుకు కోచ్‌గా హుస్సేన్ వ్యవహరించనున్నారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులను ఎల్ఎంఎస్ కార్పొరేట్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్ అధినేత, హాకీ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ అస్లాం అందజేశారు. కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ గౌరీప్రసాద్, జాయింట్ కార్యదర్శి అరవింద్‌గౌడ్ పాల్గొన్నారు.

రూ.20 లక్షల గోల్‌మాల్

- రైల్వే డివిజన్ ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నిధులు స్వాహా
- పూర్తి స్థాయి విచారణకు ఆదేశించిన డీఆర్ఎం


డీఆర్ఎం కార్యాలయం

గుంతకల్లు: స్థానిక రైల్వే డివిజన్ ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్‌లోని ఖాతా నుంచి దాదాపు రూ.20 లక్షలకు పైగా సొమ్ము పక్కదారి పట్టింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూడడంతో ఉన్నత స్థాయి విచారణకు డీఆర్ఎం ఆదేశించారు.

ఆర్గనైజేషన్‌కు నిధుల సమీకరణ ఇలా..

డివిజన్ హెడ్‌క్వార్టర్స్ గుంతకల్లు కేంద్రంగా దక్షిణ మధ్య రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ పనిచేస్తోంది. ఈ సంస్థకు డీఆర్ఎం సతీమణి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ఇతర ఉన్నతాధికారుల సతీమణులు కార్యదర్శులు, మెంబర్లుగా ఉంటారు. ఆర్గనైజేషన్ తరపున పలు సేవా, ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ ఆర్గనైజేషన్‌కు రైల్వే పాఠశాల నుంచి వచ్చే ఫీజులతో పాటు వివిధ వర్గాల నుంచి భారీగా విరాళాలు అందుతాయి. అంతేకాక వైట్‌హౌస్ మంటపం, క్యాంటీన్ల నుంచి వచ్చే మొత్తం సొమ్ము, రైల్వేస్టేషన్ రోడ్డులోని కోడిగుడ్ల బ్రిడ్జి సమీపంలో ఖాళీగా ఉన్న రైల్వే స్థలంలో ఏర్పాటు చేసుకున్న పచ్చి టెంకాయల దుకాణదారుల నుంచి అద్దెలు కూడా ఆర్గనైజేషన్ ఖాతాలోనే జమ అవుతాయి. ఆర్గనైజేషన్ కార్యకలాపాలు చూసేందుకు సీనియర్ డీపీఓ కార్యాలయంలో పని చేసే ఓ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ (డబ్ల్యూఐ)తో పాటు, అకౌంట్ వ్యవహారాలు చక్కబెట్టేందుకు మరో కాంట్రాక్ట్ ఉద్యోగిని ఏర్పాటు చేసుకున్నారు.

డబ్ల్యూఐ కనుసన్నల్లోనే అక్రమాలు..

ఆర్గనైజేషన్ నిధుల వినియోగంపై మూడు నెలల క్రితం ఆడిట్ నిర్వహించారు. ఆ సమయంలో ఖాతాలోని రూ.20 లక్షలకు పైగా సొమ్ముకు సరైన లెక్కలు చూపలేకపోయారు. దీంతో ఈ సొమ్ము కాస్త పక్కదారి పట్టినట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. అకౌంట్ వ్యవహారాలు చూస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగితో పాటు మరో టీచర్‌ను కలుపుకుని ఖాతాలోని సొమ్మును డబ్ల్యూఐ స్వాహా చేసినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆర్గనైజేషన్ అధ్యక్ష, కార్యదర్శులతో చెక్‌లపై, ఇతర ముఖ్యమైన డాక్యుమెంట్లపై ముందే సంతకాలు చేయించుకుని డబ్బు కాజేసినట్లుగా విచారణలో బహిర్గతం కావడంతో డబ్ల్యూఐపై ఆర్గనైజేషన్ సభ్యులు మండిపడ్డారు.

అక్రమాలు జరిగాయి ఇలా...

గుంతకల్లులోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో ఉన్న ఆర్గనైజేషన్ ఖాతాలో దాదాపు రూ.4లక్షలను ఒక్కసారిగా విత్‌డ్రా చేసి, ఆ ఖాతాను రద్దు చేశారు. తిరిగి అదే బ్యాంకులో మరో కొత్త ఖాతాను సృష్టించి అందులో రూ.50వేలు మాత్రమే జమ చేసి మిగిలిన రూ.3.50 లక్షలను అక్రమార్కులు సొంతానికి వాడుకున్నట్లుగా ఆడిట్ అధికారులు గుర్తించారు. మొత్తం రూ.20 లక్షలకు పైగా సొమ్మును యథేచ్ఛగా సొంతానికి వాడుకున్నట్లుగా బహిర్గతమైంది. ఈ మొత్తం వ్యవహారం డీఆర్ఎం వినీత్‌సింగ్ దృష్టికి వెళ్లడంతో ఈ అంశాన్ని ఆయన చాలా తీవ్రంగా పరిగణిస్తూ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. ఆర్గనైజేషన్ నిధులతో పాటు రాయచూర్ సెక్షన్ డబ్ల్యూఐగా ఉన్న సదరు వ్యక్తిని ప్రస్తుతం సీనియర్ డీపీఓ కార్యాలయానికి పరిమితం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విచారణ కొనసాగుతోంది

ఉమెన్స్ ఆర్గనైజేషన్ నిధుల్లో దాదాపు రూ.13లక్షలు వరకూ తన వ్యక్తిగత అవసరాలకు డబ్ల్యూఐ వాడుకున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో ఆయనతో పాటు మరో టీచర్ కూడా ఉన్నట్లు తెలిసింది. ఈ అంశంపై డీఆర్ఎం వినీత్‌సింగ్ ఆదేశాల మేరకు పూర్తి స్థాయి లోతైన విచారణ కొనసాగుతోంది.

– జయశంకర్‌చౌహాన్, సీనియర్ డీపీఓ, గుంతకల్లు

నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం

- 19 ఏళ్ల వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు
- జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి


విద్యార్థులకు సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: నులి పురుగుల నివారణతోనే చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. 19 ఏళ్ల లోపు వయసున్న చిన్నారులందరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులందరికీ అల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్నట్లు తెలిపారు. రెండేళ్లలోపు పిల్లలకు సగం మాత్ర, ఆపై వయసున్న వారికి 400 మిల్లీ గ్రాముల మాత్ర ఒకటి మధ్యాహ్నం భోజనం అనంతరం అందజేయాలన్నారు. జిల్లాలో శుక్రవారం ఒక్క రోజే 5,050 పాఠశాలల్లో 3,74,171 మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు అందించామన్నారు. గైర్హాజరైన విద్యార్థులకు ఈనెల 16వ తేదీన అందజేయనున్నట్లు వెల్లడించారు. మాత్ర వేసుకున్న తర్వాత ఏదైనా రుగ్మత తలెత్తితే వెంటనే సచివాలయంలోని ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలను సంప్రదించాలన్నారు. హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నివేదిత, డెమో బాబాఫక్రుద్దీన్, డీపీఎం కేసీకే నాయక్, కోఆర్డినేటర్ రాజేష్, వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న, సీడీపీఓ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సోమందేపల్లి: మండలంలోని జూలకుంట ఎస్సీ కాలనీకి చెందిన ధనుంజయ (27) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కూలీ పనులతో జీవనం సాగిస్తున్న ధనుంజయ మద్యానికి బానిస. గురువారం రాత్రి మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలంటూ తల్లి జయమ్మతో గొడవపడ్డాడు. ఆమె డబ్బు ఇవ్వకపోవడంతో అందరూ నిద్ర పోయిన తర్వాత తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం ఈ విషయాన్ని గమనించిన తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.